చించోలి(బి) సమీపంలో బెబ్బులి..

సారంగాపూర్: మండలంలోని చించోలి(బి)గ్రామ సమీపంలో మహబూబా ఘాట్స్‌పై ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో పెద్దపులి రోడ్డు దాటుతూ వాహన దారులకు కన్పించింది. వారంతా ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయింది. ఈవిషయం తెలిసి అటవీశాఖ డీఆర్‌ఓ నజీర్ ఖాన్.. సిబ్బందితో కలిసి మహబూబాఘాట్స్‌కు చేరుకుని పులి ఆనవాళ్ల కోసం వెతుకుతూ చోదకులను అప్రమత్తం చేస్తున్నారు.



న్యూస్‌రీల్

సర్వేకు సహకరించాలి



సర్వేను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహక రించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వేకు వచ్చే సిబ్బం దికి పూర్తి సమాచారం అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఖోఖో పోటీలు



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని విజయ హైస్కూల్ పాఠశాల మైదానంలో ఆదివారం ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-17 బాలుర జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిం చారు. ఇందులో ఎంపికై న క్రీడాకారులు ఈ నెల 11న ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో నిర్వ హించనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమం లో ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్ గౌడ్, పీడీలు భోజన్న, అన్నపూర్ణ, సంగీత, లక్ష్మీ, కృష్ణ ,శ్రీనివాస్, పీటీలు మారుతి, గిరిప్రసాద్, కృష్ణ వేణి, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యలో నృత్య ప్రదర్శన



ప్రశంసపత్రం, జ్ఞాపికలతో చిన్నారులు

భైంసాటౌన్/నిర్మల్‌టౌన్: భారత్ ఆర్ట్స్ అకాడ మీ ఫౌండర్ లలిత ఆధ్వర్యంలో అయోధ్యలోని రామమందిరంలో శనివారం నిర్వహించిన రాంలల్లా సంగీత నృత్యార్చనలో జిల్లా విద్యార్థులు పాల్గొన్నారు. నిర్మల్ స్వరూపిణి నృత్య కళాక్షేత్రం తరపున నిర్మల్ పట్టణానికి చెందిన సుంకరి ప్రేమలత, మహేష్ దం పతుల కుమార్తె సహస్ర, భైంసా పట్టణానికి చెందిన చిన్నారులు శ్రీవల్య, ఆరాధ్య, సాక్షి, జ్ఞానిక రెడ్డి, సౌమ్య రెడ్డి, అశ్వినిరెడ్డి, హాసిని, సాన్వి పాల్గొని కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కార్యక్రమ నిర్వహ కులు చిన్నారులతో పాటు నాట్యగురువు నవ్యకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

నేడు పెన్షనర్ల అత్యవసర సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్: అఖిలభారత రాష్ట్ర పెన్షనర్ల సమైక్య, న్యూఢిల్లీ సెక్రెటరీ జనరల్ డి.సుధాక ర్, మహిళా ప్రతినిధి ఉమారెడ్డి బృందం నిర్మ ల్‌కు విచ్చేస్తున్న సందర్భంగా సోమవారం ఉదయం 11 గంటలకు పెన్షనర్ల సంఘ భవ నంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల సంఘ జిల్లా బాధ్యులు, నిర్మల్, ఖానాపూర్, భైంసా, ముధోల్ యూనిట్ల సంఘ బాధ్యులు, సమస్త ప్రాథమిక సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో ముఖ్యంగా జాతీయస్థాయి సమస్య అయిన ఇన్‌కంట్యాక్స్, రాష్ట్రస్థాయి జటిల సమస్య అయిన నగదు రహిత వైద్య సదుపాయం, ఈహెచ్‌ఎస్ సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పెద్దపులి కోసం గాలింపు



గాలిస్తున్న అటవీశాఖ అధికారులు

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీ తాండ అటవీ ప్రాంతంలో ఆదివారం అధికారులు పెద్దపులికోసం గాలింపు చేపట్టారు. మూడు బృందాలుగా విడిపోయి నర్సాపూర్(జి)నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవుని చెరువు, కుస్లి, తిమ్మాపూర్(జి), దిలావర్ పూర్ మండలంలోని కదిలి అటవీ ప్రాంతాల్లో గాలిం చారు. కానీ ఎక్కడా పులి ఆనవాళ్లు లభించ లేదు. పశువులు, గొర్రెల కాపరులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులికి ప్రమాదం కలిగేలా ఎలాంటి ఉచ్చులు, విద్యు త్ తీగలు అమర్చినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో రామకృష్ణ, ఫ్లయింగ్ స్క్వాడ్ అనిత, డీఆర్వో నజీర్‌ఖాన్, ఎఫ్ఎస్‌వో అలేఖ్య, ఎఫ్ బీవో సాయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భైంసాలోని ఏపీనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

పదిపై ప్రత్యేక దృష్టి..!

- నేటి నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభం
- సాయంత్రం గంటపాటు మాత్రమే
- ఆదేశాలు జారీ చేసిన డీఈవో

భైంసాటౌన్/నిర్మల్ రూరల్: జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు నేటి నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు డీఈవో రవీం దర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత రెండు విద్యాసంవత్సరాలుగా పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విద్యాసంవత్సరం సైతం వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసి జిల్లాను ముందుంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిం చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సకాలంలో సిల బస్ పూర్తి చేసి, ప్రతీరోజు సాయంత్రం అదనంగా గంటపాటు సబ్జెక్ట్‌ల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, జిల్లా పరిషత్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలే, గురుకుల యాజమాన్య పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 11 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రతీరోజు సాయంత్రం 4:15 గంటల నుంచి 5:15 గంటల వరకు ప్రత్యేక తరగ తులు నిర్వహించాలని షెడ్యూల్ విడుదల చేశారు.

సాయంత్రం మాత్రమే...!

ఇదిలా ఉండగా గతంలో పదో తరగతి విద్యార్థు లకు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గం ట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించేవారు. ఉదయం 8:30 గంటల నుంచి 9:30 గంటల వరకు, సాయంత్రం 4:30 గంటల నుంచి 5:30 గం టల వరకు సబ్జెక్టుల వారీగా తరగతులు తీసుకునే వారు. కాగా ఈసారి సాయంత్రం అదనంగా గం టపాటు మాత్రమే తరగతులు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో విద్యార్థుల సన్న ద్ధతకు సమయం సరిపోతుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక ప్రణాళిక ఇలా..

పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసేందుకుగానూ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవో పలు సూచనలు చేశారు.

- ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చూడడంతో పాటు ప్రత్యేకంగా పరిశీలన చేయాలి.
- సబ్జెక్టులవారీగా డిసెంబర్‌లోపు సిలబస్ పూర్తి చేయాలి.
- ప్రత్యేక తరగతులకు విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా చూడాలి.
- సబ్జెక్టు టీచర్లు విద్యార్థులను దత్తత తీసుకుని, వారి అభ్యసన ప్రగతికి దోహదపడాలి.
- సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, పునశ్చరణ తరగతులు నిర్వహిం చాలి.
- పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతిపై చర్చించాలి.
- సాయంత్రం ప్రత్యేక తరగతుల నేపథ్యంలో విద్యార్థుల భద్రతపైనా దృష్టి పెట్టాలి.
- ప్రతీవారం చాప్టర్ వారిగా స్లిప్ టెస్టులు నిర్వ హించాలి.

ఆదేశాలు జారీ చేశాం

పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్న ద్ధం చేయాలన్న విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతుల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేశాం. ఈనెల 11 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వ హించాలని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యా యులకు ఆదేశాలు జారీ చేశాం.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

భోజనం.. బలవర్ధకం!

- హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంపు
- ఏడేళ్ల సుదీర్ఘకాలం తర్వాత విద్యార్థులకు ఉపశమనం



జిల్లా కేంద్రంలోని బాలికల గురుకుల విద్యాలయంలో భోజనం చేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: చాలీచాలని డైట్ చార్జీలు, కాస్మోటిక్ ఖర్చులుతో కాలం వెల్లదీస్తున్న గురుకుల పాఠశా లల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం ప్రకటించింది. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో అభ్యసిస్తున్న విద్యార్థులకు దీపావళి సం దర్భంగా తీపి కబురు చెప్పింది. డైట్ చార్జీల తోపాటు, కాస్మెటిక్ చార్జీలు పెంచుతూ నిర్ణయాన్ని తీసుకుంది. 2016-17లో అప్పటి ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచింది. ఏడేళ్ల తర్వాత తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం చార్జీలను పెంచింది. పెంచిన చార్జీలు ఈ నెల నుంచి అమలులోకి వస్తా యని సంక్షేమ శాఖల అధికారులు తెలిపారు.

విద్యార్థుల హర్షం..

డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపుపై గురుకులాల విద్యా ర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద విద్యార్థు లు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న నేపథ్యం లో భోజన, వసతి సదుపాయాలతోపాటు నాణ్యమైన విద్యను అందించేందుకు గురుకులాలు కృషి చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో సాంఘిక సం క్షేమ శాఖ, గిరిజన, వెనుక బడిన గురుకులాలు, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యా సంస్థ లు, హాస్టళ్లు కొనసాగుతు న్నాయి. గురుకులాల్లో విద్యాలయాల ఆవరణలోనే వసతి ఏర్పాటు చేస్తుండగా, సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ సమీప పాఠశాలల్లో అభ్య సించేవారు ఉన్నారు. నిత్యా వసరాల ధరలు నానాటికి పెరిగిపోతున్నా డైట్, కాస్మె టిక్ చార్జీలు ఏడేళ్లుగా పెంచ లేదు. దీంతో మెనూ సక్ర మంగా అమలు కాలేదు. ఈ తరుణంలో ప్రస్తుతం ఈ చార్జీలను 40 శాతం మేర పెంచడంతో మరింత నాణ్యమైన పౌష్టికాహారం అమలు చేసే అవకాశం ఏర్పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాస్మెటిక్ చార్జీలను కూడా పెంచడంతో బాల బాలికల పరిశుభ్రతకోసం మరింత భరోసా కల్పిం చినట్లయింది.

ఉమ్మడి జిల్లాలో 75 వేల మందికి లబ్ధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ గురుకుల విద్యా సంస్థలు కొనసాగుతు న్నాయి. డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచడంతో జిల్లా లోని దాదాపు 275 విద్యాలయాల వసతి గృ హాల్లోని సుమారు 75 వేలకుపైగా మంది విద్యార్థు లకు ప్రయోజనం కలుగుతుంది. విద్యార్థులకు మరింత పోషక విలువలు కలిగిన ఆహారం అందిం చే అవకాశముంటుందని జిల్లా సంక్షేమ శాఖల అధికారులు, గురుకులాల సమన్వయకర్తలు తెలిపారు.

డైట్ చార్జీలు ఇలా..

తరగతుల వారీగా	ప్రస్తుత(రూ.లలో)	కొత్తవి(రూ.లలో)
3–7వ	950	1,330
8–10వ	1,100	1,540
ఇంటర్–పీజీ	1,500	2,100

కాస్మెటిక్ చార్జీలు ఇలా...

తరగతుల వారీగా (బాలురు, బాలికలు)	ప్రస్తుత(రూ.లలో)	కొత్తవి(రూ.లలో)
3 నుంచి 7వరకు బాలురు	62	150
3 నుంచి 7 వరకు బాలికలు	55	175
8 నుంచి 10వ వరకు బాలురు	62	200
8 నుంచి 10 వరకు బాలికలు	75	275

అడెల్లిలో భక్తుల సందడి



సారంగాపూర్: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అడెల్లి మహాపోచమ్మ దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాలైన నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్‌తో పాటు పొరుగు రాష్ట్ర మైన మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లిం చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రమేశ్, సిబ్బం ది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

బాక్సింగ్ ఎంపిక పోటీలు



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సహస్ర మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో ఆదివారం ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాలబాలికల అం డర్ 14, 17, 19 బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో అనన్య, నితిక్ష, సీహెచ్ అశ్విత, కీర్తన, అభినయ, అక్షయ, శ్రావణి, నక్షత్ర, రజని, బాలుర విభాగంలో ధ్రువ అభినవ్, కౌశిక్ రెడ్డి, ఇర్ఫాన్ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్ గౌడ్, జిల్లా బాక్సింగ్ సెక్రెటరీ చం దుల స్వామి అభినందించారు.

పచ్చ బంగారానికి తెగుళ్లు



దుంపకుళ్లు సోకిన పసుపు మొక్క



ఆకుమచ్చ తెగులు సోకిన పసుపు మొక్క

- సస్యరక్షణతో నివారణ
- సూచనలు చేస్తున్న అధికారులు

మామడ: పసిడితో పోల్చుకునే పసుపు పంట తెగుళ్ల బారిన పడుతోంది. వాతావరణ పరిస్థి తుల కారణంగా దుంపకుళ్లు, దుంప ఈగ, తాటాకు మచ్చ, ఆకుమాడు తెగుళ్లు సోకుతు న్నాయి. జిల్లాలో ఈ ఏడాది 5,542 ఎకరాల్లో రైతులు పసుపు పంటను సాగు చేశారు. నిర్మల్ డివిజన్‌లోనే 4,359 ఎకరాల్లో పసుపు పంట వేశారు. తొమ్మిది నెలల పాటు సుదీర్ఘ పం టకాలం కలిగిన పసుపు పంటకు పెట్టుబడి ఎక రాకు రూ.లక్షకు పైగానే వెచ్చించాల్సి వస్తోంది. గతేడాది 5వేల ఎకరాల్లో పసుపు పంటను సాగు చేయగా ఆశించిన ధర లభించడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. మరో రెండు నెలల్లో పంట చేతికి అందనుంది. ఈ సమయంలో తెగుళ్లు ఆశిస్తుండడంతో రైతులు దిగుబడులపై దిగాలు చెందుతున్నారు. రైతులు అప్రమత్తంగా ఉండి సస్యరక్షణ చర్యలు చేపడితే పంటను రక్షిం చుకోవచ్చని ఉద్యాన, పట్టు పరిశ్రమ నిర్మల్ డివిజన్ అధికారి మౌనిక పేర్కొన్నారు.

దుంపకుళ్లుతో దిగుబడిపై ప్రభావం

ఈ ఏడాది ఆరంభం నుంచి అధిక వర్షాలు కురియడంతో పసుపు చేనులో నీరు నిలిచి దుం పకుళ్లు తెగులు ఆశించింది. ఈ తెగులు ఆశిం చిన మొక్కల ఆకులు గోధుమ రంగులోకి మారి వాడిపోయి ఎండిపోతాయి. మొక్కపైన లేత ఆకుల వరకు వ్యాప్తి చెందుతుంది. తల్లి, పిల్ల దుంపలు కుళ్లి దుర్వాసన వస్తుంది. దీని నివార ణకు లీటర్ నీటికి 2 గ్రాముల మెటాలాక్సిల్ లేదా మాంకోజెబ్ లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ ద్రావ ణాన్ని మొక్క మొదలుచుట్టూ నేల తడిచే విధం గా పోయాలి.

తాటాకు మచ్చ తెగులు

ఈ తెగులు సోకిన మొక్క ఆకులపై పెద్ద ఆకారపు మచ్చలు ముదురు గోధుమ రంగులో ఉంటాయి. మచ్చ చుట్టూ పసుపు రంగు వలయం ఉంటుంది. మచ్చలు అంతటా వ్యాపించి ఆకు మాడిపోతుంది.

ఆకుమాడు తెగులు

ఈ తెగులు సోకిన మొక్క ఆకులపై చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడుతాయి. ఇవి అండా కారంగా, దీర్ఘచతురస్రాకారంగా ముదురు గోధుమరంగులో ఉంటాయి. మచ్చలు ఎక్కు వైతే ఆకు మాడిపోతుంది. నివారణకు లీటర్ నీటికి 1 ఎంఎల్ ప్రొపికొనజోల్ లేక కార్బండిజ మ్‌తో పాటు 2.5 గ్రాముల మాంకోజెబ్‌ను కలిపి పసుపు పంటపై పిచికారీ చేయాలి.

దుంప ఈగతో తెగులు

ఈ కీటకం పసుపు పంటకు అక్టోబర్ మాసంలో సోకి పంట చివరి వరకూ ఉంటుంది. గుడ్ల నుం డి బయటికి వచ్చిన తెల్లని పురుగులు దుంప లకు రంధ్రం చేసి కాండాన్ని తింటూ మలినాలను బయటకు పంపిస్తుంది. దీంతో మొక్కల సుడిబాగం ఎండిపోతుంది. మొవ్వును లాగితే సులభంగా ఊడివస్తుంది. నివారణకు తెగులును గమనించిన వెంటనే ఎకరాకు 5 కిలోల వేపపిండిని పసుపు పంటలో చల్లు కోవాలి. 10 కిలోల 3జి కార్బోఫ్యూరాన్ గుళికలు వేయాలి. లీటర్ నీటికి ఒక మిల్లీలీటర్ డైమిథాయేట్ లేదా 1ఎంఎల్ ప్రొఫినోపాస్‌ను కలిపి పిచికారీ చేయాలి.

పంట దెబ్బతింటోంది

నేను ఈ ఏడాది నాలుగెకరాల్లో పసుపు పం టను సాగు చేశా. మొక్కలు ఏపుగా పెరిగాయి. కాండాన్ని తీసి చూస్తే దుంపకుళ్లు తెగులు సోకి దుంపలు పాడవుతున్నాయి. దిగుబడిపై ప్రభావం పడుతుందని ఆందోళనంగా ఉంది.

– భీంరెడ్డి, రైతు, కొరిటికల్

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఈ ఏడాది అధిక వర్షాలు కురియడంతో పసుపు పంటను దుంపకుళ్లు, తాటాకు మచ్చ తెగులు, ఆకుమాడు తెగులు ఆశిస్తున్నాయి. రైతులు ఆందోళన చెందకుండా సస్యరక్షణ చర్యలు చేపడితే పంటను కాపాడుకోవచ్చు.

– ఎస్.మౌనిక, ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి, నిర్మల్ డివిజన్

సర్వే పక్కాగా నిర్వహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



ధని గ్రామంలో సర్వేపై ఆరా తీస్తున్న కలెక్టర్

సారంగాపూర్: జిల్లాలో చేపడుతున్న ఆర్థిక, సామా జిక, విద్య, కుల, తదితర సామాజిక సర్వేను పక్కా గా నిర్వహించాలని, ప్రజల్లో విలీనమై సర్వే చేప ట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మండ లంలోని ధని గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం చేపడు తున్న ఈసర్వేను ఎన్యుమరేటర్లు పక్కాగా నిర్వ హించాలని సూచించారు. ఇచ్చిన ఫార్మాట్‌లో నమోదు అంశాలపై ప్రజలు ఇచ్చిన పూర్తి అభిప్రా యాన్ని నమోదు చేసుకోవాలన్నారు. డేటా ఫార్మా ట్‌లో పేర్కొన్న ప్రతీ అంశాన్ని కోడింగ్ విధాన పరిధిలోకి వస్తున్నాయా లేదా అనే విషయాలను సైతం తెలుసుకోవాలని సూచించారు. సర్వే అంశం లో చూపించిన ప్రతీ అంశంపై పూర్తి సర్వే చేపట్టిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు కోసం పంపించాల న్నారు. ప్రతిరోజు సర్వే అంశాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక విభాగం పనిచేస్తుందని, తప్పకుండా ప్రజలు ఇచ్చిన పూర్తి సమాచారం సర్వేలో నమోద య్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహ సీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, తదిత రులు పాల్గొన్నారు.

'మున్నూరుకాపులు ఐక్యంగా ముందుకెళ్లాలి'



విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ఖానాపూర్: మున్నూరుకాపులంతా ఐక్యంగా ముం దుకెళ్లాలని ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ మంత్రి జోగు రామన్న అన్నా రు. ఆదివారం పట్టణంలోని విద్యానగర్‌లో తిమ్మా పూర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన రైతునాగలి విగ్రహావిష్కరణ కార్యక్రమా నికి హాజరై మాట్లాడారు. దేశానికి వెన్నెముక అయి న రైతన్నకు వెన్నుదన్నుగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బీసీలకు రాజకీయాల్లో స మన్యాయం జరగాలంటే కాపులు అన్ని కులాలను కలుపుకొని పోవాలన్నారు. అంతకుముందు పట్టణ ంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ చిన్నం సత్యం, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, నాయకులు కడుకుంట్ల రవి, బీసీ రాజన్న, నిమ్మల రమేశ్, సిరిపురం నాగరాజు, ఆకు ల శ్రీనివాస్, బక్కశెట్టి లక్ష్మణ్, దయానంద్, ప్రదీప్, గంగాధర్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జోనల్‌స్థాయి క్రీడాపోటీలు

ముధోల్: మండల కేంద్రంలోని తెలంగాణ సాం ఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో సోమ వారం నుంచి ఈ నెల 14 వరకు పదవ జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు కోఆర్డినే టర్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నిరంజన్ తెలిపారు. ఆది వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వా రు మాట్లాడుతూ అండర్-14, 17, 19 స్థాయిల్లో వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారం, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, టెన్నికై ట్స్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ దిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగి త్యాల జిల్లాల్లోని 12 సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల నుంచి సుమారు 1,020 మంది పోటీల్లో పాల్గొననున్నట్లు వారు పేర్కొన్నారు. క్రీడల నిర్వ హణకు ఐదుగురు పీడీలు, 18 మంది పీఈటీలు, 300 మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ఇందుకు 17 కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరుకానున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

మానసికస్థితి సరిగా లేక వ్యక్తి ఆత్మహత్య


మృతదేహం వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై సాయికుమార్


వినోద్ (ఫైల్)

పెంబి: మానసిక స్థితి సరిగా లేక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం..మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన నముల్ల చిలుకవ్వ-లచ్చన్న దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్నకుమారుడు నముల్ల వినోద్(27) చిన్నప్పటి నుంచి మానసిక స్థితి సరిగా లేదు. ఎలాంటి పనులు చేయడం లేదు. ఈక్రమంలో మనస్తాపం చెందాడు. శుక్రవారం తన పొలానికి వెళ్లి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. తల్లి చిలుకవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, మూడేళ్ల కుమారుడు ఉన్నాడు.

ఉరేసుకుని ఒకరు..


రాములు(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని భైల్‌బజార్ ప్రాంతానికి చెందిన బంటోల్ల రాములు(38) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ ఎస్సై ఎండీ గౌసుద్దీన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..రాములు స్థానికంగా కూలీ పనులు చేసుకుంటున్నాడు. కొన్నేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో తలకు గాయమై అప్పటి నుంచి మతిస్థిమితం సరిగా లేక బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఆదివారం భార్య సంగీత కూలీ పనులకు వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు..


సంతోష్ (ఫైల్)

దిలావర్‌పూర్: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..మండలంలోని బన్సపల్లి గ్రామానికి చెందిన మస్త సంతోష్(37)కు లోకేశ్వరం మండలం మన్మథ్ గ్రామానికి చెందిన స్వప్నతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. కుమారుడిని తీసుకుని భార్య కొన్నిరోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈక్రమంలో భర్త మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 2న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. గ్రామానికి ఆనుకుని ఉన్న పంటచేలో పురుగుల మందు తాగి మృతి చెందాడు. అక్కడ రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఐదు రోజుల క్రితం పురుగుల మందు తాగి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేపు జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 12, 13వ తేదీల్లో వనవాసీ కల్యాణ్ పరిషత్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు అశోక్, నగేష్ ఓ ప్రకటనలో తెలిపారు. భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని ఆదివాసీ యువకుల క్రీడా నైపుణ్యాలను వెలికితీయాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు ఎంట్రీలు నమోదు చేసుకోవాలని, సాయంత్రం 5 గంటలకు డ్రా తీయనున్నట్లు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్‌యూనివర్సిటీలో 2024- 25 సంవత్సరానికి డిగ్రీలో ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ పొందడానికి ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, కోఆర్డినేటర్ దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2019- 2023 సంవత్సరాల్లో అడ్మిషన్ తీసుకున్న రెండు, మూడో సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు 15లోగా చెల్లించాలని పేర్కొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు


మెదక్ జిల్లా జట్టుకు బహుమతి అందజేస్తున్న ఏసీపీ, డీఐఈవో

- సాఫ్ట్‌బాల్ బాల, బాలికల్లో మెదక్, నిజామాబాద్ జట్ల జయకేతనం
- హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్‌లు
- విజేతలకు బహుమతుల ప్రదానం


నిజామాబాద్ జిల్లా జట్టుకు బహుమతి ఇస్తున్న ఏసీపీ, డీఐఈవో

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా రెండు రోజుల పాటు నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. సింగరేణి తిలక్ స్టేడియంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో బాల,బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 9 బాలుర, 9 బాలికల జట్లు హాజరయ్యాయి. ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. నువ్వా నేనా అనేరీతిలో క్రీడాకారులు పోటీపడగా బాలుర విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయస్థానంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు, తృతీయస్థానంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు (ద్వితీయ), మహబూబ్‌నగర్ జిల్లా జట్టు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి.

సత్తాచాటిన మెదక్, నిజామాబాద్ జిల్లాల జట్లు..

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల జట్లు సత్తాచాటాయి. ఆది నుంచి ఆ రెండు జిల్లాల జట్లు పట్టుదలతో ఆడాయి. ఉమ్మడి మెదక్ జిల్లా బాలుర జట్టు పట్టు వీడకుండా ఆడి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, అదే జిల్లాకు చెందిన బాలికల జట్టు ప్రత్యర్థి జట్టుతో తలపడి ద్వితీయ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. బాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు హోరాహోరీగా తలపడి ప్రథమస్థానాన్ని దక్కించుకోగా, అదే జిల్లాకు చెందిన బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచి సత్తా చాటింది. ఈ పోటీల్లో మెదక్, నిజామాబాద్ జిల్లాల బాల,బాలికల జట్లు రెండేసి బహుమతులు దక్కించుకున్నాయి.

బహుమతుల ప్రదానం

తిలక్ స్టేడియంలో పోటీలు నిర్వహించగా పక్కనే ఉన్న బజారుఏరియా జెడ్పీ ఉన్నత పాఠశాలలో విజేతల జట్లకు ప్రదానోత్సవం జరిగింది. బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, డీఐఈవో కె.అంజయ్య, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య, తాండూర్ సీఐ కుమారస్వామిలు గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. సత్తా చాటిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రీడా పోటీల పరిశీలకులు పీడీ గంగామోహన్, శంకరయ్య, కన్వీనర్ ఆదిలాబాద్ జిల్లా పీడీఎస్ స్వామి, ఉమ్మడి జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ సెక్రెటరి బాబురావు, నిర్వాహకులు రామ్మోహన్‌రావు, ఎండీ యాకూబ్, బండి రవి, ఎండీ చాంద్‌పాషా, ఎస్‌కే రాజ్‌మహ్మద్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, చిన్నక్క, యాదగిరి పాల్గొన్నారు.


ట్రెడిషనల్ బాలుర విభాగంలో విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు


ఫాస్ట్-5 బాలికల విభాగంలో గెలుపొందిన నల్గొండ జట్టు

నిర్మల్‌లో నెట్‌బాల్ పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈనెల 8 నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-16 సబ్ జూనియర్స్ బాల, బాలికల ఫాస్ట్-5, ట్రెడిషనల్ నెట్‌బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్రంలోని 24 జిల్లాల నుంచి 48 జట్లు, 850 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్స్ ట్రెడిషనల్‌లో బాలుర విభాగంలో మహబూబ్‌నగర్-నారాయణపేట్ జట్లు తలపడగా మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో ఫైనల్‌లో మహబూబ్‌నగర్ జట్టుపై నల్గొండ జట్టు గెలుపొందింది. ఫాస్ట్-5 ఫైనల్స్‌లో బాలుర విభాగంలో కరీంనగర్ జట్టును ఓడించి నారాయణపేట్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్-నల్గొండ జట్లు తలపడగా నల్గొండ జట్టు జయకేతనం ఎగురవేసింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ ఆదిత్యరెడ్డి, ప్రముఖ వైద్యుడు అవినాష్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు. నెట్‌బాల్ రాష్ట్ర సెక్రటరీ ఖాజాఖాన్, జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, సెక్రెటరీ మోహన్, ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి భోజన్న, డాక్టర్ వేదవ్యాస్, ఆర్గనైజర్ వన్నెల భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు జమున, అన్నపూర్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత


పర్సును అప్పగిస్తున్న అంజద్

నస్పూర్: పర్సు పోగొట్టుకున్న మహిళకు యువకుడు అప్పగించాడు. పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన సత్తమ్మ ఆదివారం సీసీసీ కార్నర్ వద్ద గల ఎస్బీఐ ఏటీఎం వద్దకు వెళ్లింది. నగదు విత్‌డ్రా చేసుకుని వెళ్తుండగా పర్సు అక్కడే పడిపోయింది. సీసీసీకి చెందిన అంజద్ ఏటీఎం వద్దకు వెళ్లగా దొరికింది. కొంతసేపటికి సత్తమ్మ రావడంతో తిరిగి పర్సు అప్పగించాడు. పర్సులో రూ.700 నగదు, రెండు బంగారు పుస్తెలు ఉన్నాయని తెలిపింది.

పారిపోయిన 'ఆశ్రమ' విద్యార్థులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పారిపోయారు. ఆదివారం ఎస్టీ హాస్టల్ నుంచి పారిపోయి బస్టాండ్‌కు చేరుకున్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు సిబ్బంది చౌహాన్ కృష్ణ, శ్రీనివాస్ అక్కడికి చేరుకుని విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. 3, 6వ తరగతి చదువుతున్న వినీత్, వినాయక్, నితీశ్‌లను ఉపాధ్యాయులకు అప్పగించినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. చదువుపై ఆసక్తి లేకపోవడంతో విద్యార్థులు బయటికి వెళ్లినట్లు తెలిసింది.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్
- టీయూటీఎఫ్ రాష్ట్ర విద్యా మహాసభలు


మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీలో ఆదివారం టీయూటీఎఫ్ రాష్ట్ర 6వ మహాసభలు నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దుకు కృషి చేస్తామన్నారు. జీవో 317తో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అసెంబ్లీతోపాటు పార్లమెంట్‌లో వారి సమస్యలపై ప్రస్తావిస్తామని తెలిపారు. సమాజంలో టీచర్ల పాత్ర కీలకమని, విద్యను నిర్లక్ష్యం చేస్తే అభివృద్ధికి ఆటంకం ఎదురవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో కేటాయించింది రూ.21 వేల కోట్లు అని, ఇందులో ఇప్పటివరకు రూ.380 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. కమీషన్లు వచ్చే వివిధ సర్వేలకు ప్రైవేట్ వ్యక్తులను కేటాయించిన సర్కారు, ఎలాంటి లాభాలు లేని వాటికి టీచర్లతో సర్వే చేయిస్తుందన్నారు. గత సీఎం కేసీఆర్ విద్యారంగంపై ఒక్కరోజు సమీక్ష నిర్వహించలేదని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లచ్చిరాం, రఘునందర్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు ఉన్న ఐదు డీఏలకు గాను ఒక డీఏను మాత్రమే ప్రకటించడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. పీఆర్సీ రిపోర్టును వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే క్లియరెన్స్ చేయాలన్నారు. సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి ఎంఈవో, డైట్ లెక్చరర్, డిప్యూటీ డీఈవో, జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ఎస్టీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. డీఈవో ప్రణీత, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, మొగలయ్య, బేర దేవన్న, మురళిమనోహర్ రెడ్డి, సుజాత, కైలాసం, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి, జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 29 ఏళ్ల తర్వాత వీరందరు పాఠశాలలో ఆదివారం జరిగిన అపూర్వ సమ్మేళనానికి హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తీపి గుర్తులను నెమెరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.


మందమర్రిలో..

మందమర్రిరూరల్: మందమర్రిలోని విజ్ఞాన్ స్కూల్‌లో 2000-01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. సీఈఆర్ క్లబ్ ఆవరణలో జరిగిన అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చిన్ననాటి స్మృతులు గుర్తుచేస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానం చేశారు.

వ్యాపారులు, లారీ ఓనర్స్ మధ్య లొల్లి

- లోకల్ లారీల్లోనే లోడ్ చేయాలని చెబుతున్న లారీ ఓనర్స్
- అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామంటున్న పోలీసులు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిన్నింగ్ వ్యాపారులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ మధ్య లొల్లి జరుగుతోంది. స్థానికంగా ఉన్న లారీల్లోనే పత్తి బేళ్లను లోడ్ చేయాలని చెబుతూ లారీ ఓనర్స్ అడ్డుకుంటున్నారని ప్రైవేట్ వ్యాపారులు చెబుతున్నారు. తమకు ఇతర రాష్ట్రాల లారీల యజమానులు తక్కువ ధరకు లోడ్ చేస్తుండగా, జిల్లా కేంద్రానికి చెందిన లారీ ఓనర్లు అధిక ధరతో లోడ్ చేస్తున్నారని పేర్కొంటున్నారు. అయితే, ఈ విషయం వారి మధ్య గొడవకు దారితీస్తోంది. తమకు ఎవరు తక్కువ ధరకు ట్రాన్స్‌పోర్ట్ చేస్తే వారికే లోడ్ చేస్తామని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. లోడ్ చేసిన లారీలను అడ్డుకోవడం సరికాదని పేర్కొంటున్నారు. గత మూడేళ్లగా ఈవిధంగా చేస్తున్నారని జిన్నింగ్ అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. ఈ పంచాయితీ పోలీసుల వద్దకు చేరింది. జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ అసోసియేషన్, లారీ ఓనర్స్ అసోసియేషన్, ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ సభ్యులతో ఆదివారం జిల్లా కేంద్రంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. జిన్నింగ్ వ్యాపారులు మాట్లాడుతూ గుంటూరుకు పత్తి బేళ్లను తరలించేందుకు ఇతర రాష్ట్రాలకు చెందిన లారీల యజమానులు రూ.35 వేలకు తీసుకెళ్తే, జిల్లా కేంద్రానికి చెందిన లారీ యజమానులు రూ.42 వేలు అడుగుతున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల లారీల్లో లోడ్ చేస్తే లారీ అసోసియేషన్‌కు రూ.1220, జిల్లాకు చెందిన లారీల్లో లోడ్ చేస్తే అసోసియేషన్‌కు రూ.220 చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 20 లారీల్లో లోడ్ చేస్తే రోజుకు రూ.20 వేలు ఎలా చెల్లిస్తామని వాపోయారు. ఇతర రాష్ట్రాల విధంగానే రూ.35 వేలకు లోడ్ చేస్తే స్థానిక లారీల్లోనే లోడ్ చేయించి అద్దె చెల్లిస్తామని స్పష్టం చేశారు. తాము లోడ్ చేసిన వాహనాలను కొందరు లారీ అసోసియేషన్ వారు అడ్డుకుంటున్నారన్నారు. తమిళనాడుకు బేళ్లను తరలించేందుకు ఇతర రాష్ట్రాల లారీలు రూ.60 వేలు తీసుకుంటుంటే, స్థానిక లారీ యజమానులు రూ.70 వేల నుంచి రూ.80 వేలు అద్దె అడుగుతున్నారని పేర్కొన్నారు. దీంతో తమపై అదనపు భారం పడుతుందన్నారు. ఇదిలా ఉండగా, డీజిల్ ధర పెరగడం, అద్దె గిట్టుబాటు కావడం లేదని లారీ యజమానులు పేర్కొన్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు చెందిన లారీలను అడ్డుకోవద్దని, అలా చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైన సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్ సీఐలు సునీల్ కుమార్, కరుణకార్‌రావు, ప్రణయ్ పాల్గొన్నారు.

అన్నవరానికి దీటుగా గూడెం అభివృద్ధి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు
- కలెక్టర్‌తో కలిసి వ్రతమండపం ప్రారంభం


వ్రతమండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయాన్ని అన్నవరానికి దీటుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆలయం వద్ద దాతల సహకారంతో నిర్మించిన వ్రతమండపాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడెం సత్యదేవుడి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఇక్కడికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. వచ్చే కార్తికపౌర్ణమి వరకు కాటేజీల నిర్మాణంతోపాటు గూడెం గోదావరి నదితీరం వద్ద స్నానఘట్టాలు నిర్మిస్తామని తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే, కలెక్టర్‌కు ఈవో శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. వ్రతమండప దాతలను సన్మానించారు. కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, సీఐ నరేందర్, ఎస్సై ఉదయ్‌కిరణ్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గూడెంలో భక్తుల రద్దీ

కార్తికమాసం సందర్భంగా గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 534 జంటలు సామూహిక సత్యనారాయణవ్రతాలు నోముకున్నారు.



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

'గిరిజన విద్యార్థులపై సవతి ప్రేమ'

నార్నూర్: ఏజెన్సీలో ఆదివాసీ గిరిజన విద్యార్థులపై ఐటీడీఏ అధికారులు సవతి ప్రేమ చూపిస్తున్నారని రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్ తెలిపారు. గాదిగూడ మండలంలోని పున్నగూడ, రుప్పాపూర్, శివనూర్, అల్లిగూడ, సెద్వాయి కొలాంగూడ, మారేగాం, హీరాపూర్, చిన్నకుండి, కొత్తపల్లి(జి) గ్రామాల్లో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావుతో కలిసి ఆదివారం పర్యటించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మారుమూల మండలం కావడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంపై అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు ఏడు పాఠశాలల్లో టీచర్లు లేకపోవడంతో వందకు పైగా విద్యార్థులు నిరక్షరాసులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీచర్లు ఉన్నచోట పాఠశాల భవనాలు లేవన్నారు. భవనాలు ఉన్న చోట ఉపాధ్యాయులు లేరన్నారు. ఉన్నతాధికారులు వెంటనే ఉపాధ్యాయులను నియమించాలన్నారు. వారివెంట తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ తదితరులు ఉన్నారు.

ఆందోళనలో 'ప్రైవేట్' గార్డులు

- విధుల్లోకి తీసుకోని యాజమాన్యం
- ముగిసిన కాంట్రాక్టర్ కాలపరిమితి


మందమర్రిలోని సింగరేణి ఎస్అండ్‌పీసీ ఆఫీస్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని 46 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను యాజమాన్యం విధులకు తీసుకోవడం లేదు. సుమారు 15 రోజులుగా వారు ఆందోళన చెందుతున్నారు. ఇదివరకు వారికి పనులు చెప్పిన కాంట్రాక్టర్ కాల పరిమితి గతనెల 27తో ముగిసింది. అంతకుముందే యాజమాన్యం మరో కాంట్రాక్టర్ కోసం టెండర్ పిలువగా మురళి మ్యాన్‌పవర్ ఏజెన్సీకి టెండర్ దక్కినట్లు సమాచారం. టెండర్‌దారు ఎలాంటి చార్జ్ తీసుకోకపోవడంతో ప్రైవేట్ సెక్యూరిటీగార్డుల విధుల పంపిణీ జరగలేదు. గతంలో సింగరేణి యాజమాన్యం సీఐఎస్ఎఫ్ సిబ్బంది తొలగించిన అనంతరం టెండర్ ద్వారా నాలుగేళ్ల క్రితం 22 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను తీసుకుంది. మొదట సేఫ్ సెక్యూరిటీ, తర్వాత రెడ్డి బ్రదర్స్ కాంట్రాక్టర్‌గా వ్యవహరించారు. వారి కాలపరిమితి పూర్తవడంతో కొత్తవారికి ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు ఎవరూ రావడం లేదు. ఇదిలా ఉంటే, కొత్త కాంట్రాక్టర్ వచ్చేవరకు రెడ్డి బ్రదర్స్‌కే కేటాయిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

తొలగించే ప్రయత్నం!

సింగరేణి యాజమాన్యం ప్రైవేట్ సెక్యూరిటీని తొలగించే ప్రయత్నంలో భాగంగానే వారిని విధులకు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏరియాలో ఫీమేల్ మజ్దూర్ ఉద్యోగులు ఎక్కువగా ఉండడం వల్ల ప్రైవేట్ సెక్యూరిటీ స్థానంలో వారినే భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.